ఆంధ్రజ్యోతి
andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 29.9 । కనిష్ఠం 24.6



వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

బాసర, జూలై9 (ఆంధ్రజ్యోతి): బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో గురు పౌర్ణమి వేడుకలు వైభవంగా సాగాయి. ఉత్సవాల రెండోరోజు ఆలయ వేద పండితులు వివిధ పూజాకార్యక్రమాలను నిర్వహించారు. వ్యాసమహర్షి ఆలయంలో దేవతపూజ నీరాజనంలో ధార్మిక ప్రవచనాలు వంటి కార్యక్రమాలు చేసి వ్యాసమహర్షికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరిరోజు కూడా వివిధ కార్యక్రమాలు జరుగనున్నాయి. ఆలయంలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని వ్యాసమహర్షి ఆరాధన నిర్వహించనున్నారు.

ముగిసిన ఆర్జీయూకేటీ కౌన్సెలింగ్

- 118 విద్యార్థుల గౌర్హాజరు
- త్వరలో వేయిటింగ్ లిస్ట్ నుంచి భర్తీ

బాసర, జూలై9(ఆంధ్రజ్యోతి) : ఆర్జీయూకేటీ బాసర, మహబూబ్‌నగర్ క్యాంపస్‌లకు 2025-26 విద్యా సంవత్సరానికి గాను కౌన్సెలింగ్ ప్రక్రియ బుధవారంతో ముగిసింది. చివరిరోజుకు కౌన్సిలింగ్ కొనసాగింది. వచ్చిన విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కౌన్సిలింగ్ తీరును వైస్ చాన్సిలర్ గోవర్ధన్, పరిపాలనాధికారి మురళీదర్శన్‌లు విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ప్రవేశం కల్పించారు. మూడు రోజుల్లో 1690 మంది విద్యార్థులకు గాను 1472 మంది విద్యార్థులు కౌన్సిలింగ్‌కు హాజరయ్యారు. మిగతా 118 మంది విద్యార్థులు గైర్హాజరు కాగా.. వారి స్థానాల్లో వేయిటింగ్ లిస్టు నుంచి ఎంపిక చేస్తామని వైస్ చాన్సిలర్ గోవర్ధన్ తెలిపారు.

ఏడు నూతన సబ్‌స్టేషన్ల మంజూరు

నిర్మల్‌రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మరింత మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడానికి కొత్తగా నిర్మల్ సర్కిల్ పరిధిలో డోడెర్నా, రాంసింగ్ తండా, సోఫీనగర్, మహాలింగి, కోలూర్, పాల్సి, దత్తోజీపేట్‌లలో ఏర్పాటు చేసేందుకు 7 సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయని సర్కిల్ సూపరింటెండెంగ్ ఇంజనీర్ ఇ. సలియా నాయక్ పేర్కొన్నారు.

యూరియా కొరత లేకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి

- జడ్పీటీసీ ఓస రాజేశ్వర్

లక్ష్మణచాంద, జూలై9 (ఆంధ్రజ్యోతి): యూరియా కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని మాజీ జడ్పీటీసీ, కాంగ్రెస్ నాయకులు ఓస రాజేశ్వర్ బుధవారం డిమాండ్ చేశారు. మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రానికి రావాల్సిన యూరియాలో కేంద్రం కోత విధించడం వలన రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇకనైనా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని రైతులకు ఇంకా 1615 మెట్రిక్ టన్నుల యూరియా, 252 మెట్రిక్ టన్నుల డీఏపీ, 371 మెట్రిక్ టన్నుల 20:2:13 ఎరువుల అవసరం ఉందని తెలిపారు. సరిపడా నిల్వలు అందుబాటులో ఉంచేలా కేంద్రం కృషి చేసి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మరో కొత్త ప్రాజెక్టుకు ప్రతిపాదనలు!



- కడెం ప్రాజెక్టు కింద నిర్మించాలన్న యోచన
- 22 రేడియల్ గేట్ల ఏర్పాటుకు అంచనాలు
- ప్రస్తుత ప్రాజెక్టుకు ప్రతీయేటా వరద గండం
- సమస్యగా మారిన పూడిక
- రూ.700 కోట్ల మంజూరు చేయాలంటూ అధికారుల వినతి

నిర్మల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న కడెం ప్రాజెక్టుకు అనేక రకాల సమస్యలు తలెత్తుతున్న కారణంగా ఈ ప్రాజెక్టు పరిధిలోని 65వేల ఎకరాల ఆయకట్టు ప్రతీఏట ప్రశ్నార్థకంగా మారుతోంది. అలాగే ప్రాజెక్టులోకి వచ్చే వరద ఉధృతి కారణంగా లోతట్టు గ్రామాలన్నీ వర్షాకాలంలో భయం భయంగా గడపాల్సి వస్తుంది. దీంతో పాటు కొన్ని గ్రామాలను వరద ప్రవాహం కారణంగా ఖాళీ చేయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. ప్రతిఏటా ఇదే తరహాసమస్య ఇటు ప్రాజెక్టును, ఆయకట్టును అలాగే పరివాహక ప్రాంత ప్రజలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. కాగా ప్రాజెక్టు సమస్య సంబంధిత ఇరిగేషన్ అధికారులకు సైతం సవాలుగా మారుతుంది. ఎగువ నుంచి కడెం రిజర్వాయర్‌లోకి వచ్చే వరద నీటిని సక్రమంగా లెక్క కట్టకపోవడం అలాగే వరద ఉధృతికి అనుగుణంగా గేట్లు పైకెత్తే ప్రక్రియ విఫలమవుతుండడం పైకెత్తిన గేట్లు కిందికి దిగక పోతుండడం ప్రధాన సమస్యలుగా మారాయి. 2022, 2023 సంవత్సరాలలో వరద ఉధృతి కడెం ప్రాజెక్టును ముంచెత్తిన సంగతి తెలిసిందే. ముఖ్యంగా 2022లో వరద నీరు ఆరున్నర లక్షల క్యూసెక్కులకు పైగా ప్రాజెక్టు ద్వారా ప్రవహించడం, ఓ దశలో ఈ ప్రాజెక్టు కొట్టుకుపోతోందన్న భయాందోళనలు సైతం కొనసాగాయి. ప్రాజెక్టు అధికారులు వరద ఉధృతిని నివారించడంలో పూర్తిగా చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. ఇలా ప్రతీ ఏటా ప్రాజెక్టుకు ముప్పు ఏర్పడుతుండడంతో సంబంధిత డ్యామ్ సేఫ్టీ విభాగం అధికారులు, సెంట్రల్ డిజైన్ ఆర్గనేజేషన్ అధికారులు, ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టును పలుసార్లు సందర్శించి రీడిజైనింగ్‌తోపాటు కొత్తగా స్పిల్‌వే, అదనంగా గేట్ల ఏర్పాటు లాంటి వాటి కోసం ప్రతి పాదనలను రూపొందించారు. ఈ ప్రతిపాదనలతో ప్రాజెక్టు సమస్య శాశ్వతంగా పరిష్కారం కాదన్న నిర్ణయానికి ఇరిగేషన్ ఉన్నతాధికారులు వచ్చారు. దీంతో ప్రస్తుతం ఉన్న కడెం ప్రాజెక్టుకు దిగువన మరో కొత్త ప్రాజెక్టును నిర్మించాలని ఇరిగేషన్ ఉన్నతాధికారులు నిర్ణయించారు. దీనికి అనుగుణంగానే ప్రాజెక్టు దిగువన మూడు వందల మీటర్ల దూరంలో 22 రేడియల్ గేట్లతో కొత్త ప్రాజెక్టును నిర్మించేందుకు ప్రతిపాదిస్తున్నారు. దీనికి సంబంధించి గత రెండు రోజుల నుంచి ఇరిగేషన్‌శాఖ ఉన్నతాధికారులు ప్రాజెక్టు వద్ద సర్వే చేపడుతున్నారు. ఈ సర్వే నివేదికలను సెంట్రల్ డిజైన్ ఆర్గనైజేషన్‌కు పంపనున్నట్లు అధికారులు వెల్లడించారు. ముఖ్యంగా రేడియల్ గేట్ల ఏర్పాటుతో ఎగువ నుంచి వరద ఉధృతిని ఎప్పటికప్పుడు తెలుసుకునే అవకాశం ఉండడమే కాకుండా వరద నీటిని దిగువకు వదలడం సులభమవుతుందని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుకు సంబంధించిన 18 గేట్లు సక్రమంగా పని చేయడం లేదు. ప్రతిసారి గేట్లకు సంబంధించిన కౌంటర్ వెయిట్‌లు వరద ఉధృతికి కొట్టుకుపోవడం, అలాగే గేట్లు పైకి, కిందికి దిగలేని పరిస్థితి ఏర్పడుతోంది. అనేకసార్లు కడెం ప్రాజెక్టు సమస్య పరిష్కారం కోసం సంబంధిత అధికారులు ప్రతిపాదనను రూపొందించినప్పటికీ ఏ ఒక్క ప్రతిపాదన ఈ సమస్య పరిష్కారానికి అనుకూలంగా లేదని నీటి పారుదల నిపుణులు సూచించారు. అలాగే ప్రభుత్వం నుండి కూడా అదనంగా ప్రాజెక్టుకు ఎనిమిది గేట్ల ఏర్పాటు కోసం 700ల కోట్ల రూపాయలతో ప్రతిపాదన రూపొందించినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు ఒక్క నయా పైసా కూడా విడుదల చేయలేదు. దీంతో ప్రాజెక్టుకు ప్రతియేటా వరద సమస్య వెంటాడుతోంది.



కడెం రిజర్వాయర్

కొత్త ప్రాజెక్టు ప్రతిపాదనకు మోక్షం లభించేనా..

అయితే కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి రూపొందిస్తున్న ప్రతిపాదనలకు అటవీ శాఖ, సీడబ్ల్యూసీల అనుమతులు తప్పనిసరి. అలాగే ప్రభుత్వం కడెం ప్రాజెక్టుకు సంబంధించి ఇప్పటి వరకు నిధులు విడుదల చేయకుండా వివక్ష ప్రదర్శిస్తుందన్న ఆరోపణలున్నాయి. ప్రతిఏటా అధికారులు ప్రాజెక్టు ఆధునీకరణ కోసం పంపే ప్రతిపాదనలన్నీ బుట్ట దాఖలవుతున్నాయన్న విమర్శలు ఉన్నాయి. ప్రాజెక్టుకు అదనపు గేట్ల కోసం 700 కోట్ల రూపాయలతో అధికారులు గత రెండేళ్ల క్రితం ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పటివరకు ఆ ప్రతిపాదనలకు మోక్షం లభించడం లేదు. అయితే కొత్తగా మరో ప్రాజెక్టును నిర్మించాలన్న ఉద్దేశ్యంతో రూపొందిస్తున్న ప్రతిపాదనలకు ప్రభుత్వం ఏ మేరకు నిధులు మంజూరు చేస్తుందన్న అంశంపై సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. కొత్తప్రాజెక్టును 22 రేడియల్ గేట్లతో ప్రస్తుతం ప్రాజెక్టుకు దిగువన నిర్మించినట్లయితే వరద సమస్య గాని గేట్ల సమస్య గాని ఉండబోదని ఇరిగేషన్ అధికారులు పేర్కొంటున్నారు.

ప్రతీయేటా వరద గండం..

ప్రస్తుతం ఉన్న కడెం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 7 టీఎంసీలకు పైగా సామర్థ్యం కాగా అందులో నుండి దాదాపు మూడున్నర టీఎంసీలకు పైగా పూడిక ఉండడం ఈ ప్రాజెక్టుకు గండంగా మారుతుంది. ఎగువ నుండి వరద వచ్చే సమయంలో దిగువకు ఈ ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసే విషయంలో అనేక రకాల ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఎగువ నుండి వచ్చే వరదను సరైన రీతిలో అంచనా వేయకపోతుండడంతో ఒకేసారి ప్రవాహం పెరగ గానే ప్రాజెక్టు కొట్టుకుపోయే ప్రమాదానికి చేరుకుంటుంది. గతంలో ఇలా రెండు మూడు సార్లు ప్రాజెక్టు కొట్టుకుపోయే ప్రమాదానికి చేరుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ గండంను గట్టెక్కించుకునేందుకు ప్రాజెక్టు కింద కొత్తగా మరో ప్రాజెక్టును నిర్మించడమే మార్గమని ఇరిగేషన్ అధికారులు సూచిస్తున్నారు. ప్రభుత్వం నిధులు వెంటనే విడుదల చేసి కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి నడుం బిగించాలని కోరుతున్నారు.



పోలీసులకు సూచనలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

- అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా

సోన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా అన్నారు. బుధవారం సోన్ పోలీస్ స్టేషన్‌లో నెలవారి సర్కిల్ క్రైమ్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని, దొంగతనాలు జరగకుండా ప్రతిక్షణం విధుల్లో అప్రమత్తంగా ఉండాలని పోలీసులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సోన్ సీఐ గోవర్ధన్ రెడ్డి, ఎస్సై కే. గోపి, మామడ ఎస్సై అశోక్, లక్ష్మణచాంద ఎస్సై శ్రీనివాస్ యాదవ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ

నర్సాపూర్(జి), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : నర్సాపూర్ మండలంలోని గొల్లమాడ గ్రామంలో బుధవారం ముథోల్ నియోజకవర్గ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మీ, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. రైతు వేదికలో జరిగిన ఈ కార్యక్రమంలో మొత్తం 39మంది లబ్ధిదారులకు గాను 29 మందికి కళ్యాణ లక్ష్మీ చెక్కులు, 10మందికి షాదీముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, గిర్దావర్ సుమలత, నవత జ్యోతి, తాజా మాజీ సర్పంచ్ చెన్నా మహేష్, నాయకులు వినోద్ రెడ్డి, గంగాధర్, చాక్‌పల్లి, అర్లి(కే), గొల్లమాడ, బామిని(బి), నందన్, తురాటి, బూరుగుపల్లి(కే) లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఇందిరా మహిళా శక్తి సంబరాలు

నిర్మల్‌రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మేడిపెల్లి,న్యూ పోచంపాడ్, అక్కాపూర్, లంగ్డాపూర్, తల్వేద, వెంగ్వాపేట్ గ్రామాల్లో ఇందిరా మహిళాశక్తి సంబరాలు సమావేశాలను నిర్వహించినట్లు మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న తెలిపారు. సమావేశంలో బ్యాంక్ లింకేజీ, వడ్డీలేని రుణాలు, స్త్రీనిధి, పెన్షన్లు, ఇందిరా మహిళాశక్తి క్యాంటీన్లు, ఫార్మ్, నాన్ ఫార్మ్, ఆక్టివిటీస్, కొత్త సంఘాల ఏర్పాటు మొదలగు వాటి గురించి చర్చించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సంఘాల సభ్యులు, వీవో కార్యనిర్వాహక కమిటీ సభ్యులు, మండల సమాఖ్య అధ్యక్షురాలు స్వప్న, ఏపీఎం బోసు, సీసీ రేఖ, వీవోఏలు పాల్గొన్నారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన స్కూల్ బస్సు

పెంబి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగపూర్ గ్రామ సమీపంలో బుధవారం అదుపు తప్పి స్కూల్ బస్సు చెట్టును ఢీకొట్టింది. ఖానాపూర్ నుంచి పెంబి వచ్చే కేరళ మోడల్ స్కూల్ బస్సు నాగపూర్ సమీపంలో అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టడంతో విద్యార్థులకు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అక్కడ ఉన్న స్థానికులు అంబులెన్స్‌కు ఫోన్ చేసి ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

డ్రైనేజీ ఆక్రమణల కూల్చివేత

నర్సాపూర్(జి), జూలై 9 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం 2018లోని సెక్షన్ 90, 94 ప్రకారం డ్రైనేజీలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించేందుకు నర్సాపూర్ మండల అధికారులు కఠిన చర్యలు తీసుకుంటున్నారు. మండలంలోని టెంబుర్ని గ్రామంలో డ్రైనేజీలపై నిర్మించిన మెట్లను (స్టెప్స్) గుర్తించి, వాటిని తొలగించాలంటూ అధికారులు గతంలో నోటీసులు అందజేశారు. అయితే నోటీసులకు ఎలాంటి స్పందనా రాకపోవడంతో బుధవారం ఉదయం పంచాయతీ కార్యదర్శి శైలజ, మండల పంచాయతీ అధికారి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో అక్రమకట్టడాలను కూల్చివేశారు. ఈ కూల్చివేత ప్రక్రియను స్థానిక పోలీస్ స్టేషన్, తహసీల్దార్ కార్యాలయం, జిల్లా పంచాయతీ అధికారి ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. త్వరలోనే మండలంలోని మరిన్ని అక్రమ కట్టడాలను కూల్చి వేస్తామని మండల పంచాయతీ అధికారి తిరుపతి రెడ్డి స్పష్టం చేశారు. అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించకుండా గ్రామాభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు.

పోక్సో చట్టంపై అందరూ అవగాహన కలిగి ఉండాలి



మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్



అవగాహన కార్యక్రమానికి హాజరైన ఉపాధ్యాయులు

నిర్మల్ టౌన్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): పోక్సో చట్టంపై ప్రతీ ఒక్కరికి అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. బుధవారం సాయంత్రం పట్టణంలోని దివ్య గార్డెన్స్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు పోక్సో చట్టాన్ని కఠినంగా అమలు చేయాలని, ప్రతి విద్యార్థికి పాఠశాల స్థాయిలోనే చట్టంపై అవగాహన కల్పించాలని సూచించారు. మండలాల వారీగా ఎంఈవోలు ప్రతి పాఠశాలలో ఈ చట్టంపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలని పేర్కొన్నారు. 2012లో అమలులోకి వచ్చిన ఈ చట్టం ప్రకారం 18 ఏళ్ల లోపు బాలలపై లైంగిక నేరాలకు పాల్పడిన వారికి కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని చెప్పారు. అలాగే ఈ కేసుల విచారణ వేగంగా పూర్తయ్యేలా చట్టం రూపొందించబడిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న నిపుణుడు డేవిడ్ రాజు ఉపాధ్యాయులకు పోక్సో చట్టం, పాఠశాలల నిర్వహణ, వ్యక్తిత్వ వికాసం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం కలెక్టర్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, అధికారులు పోక్సో చట్టంపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. పాల్గొన్న విద్యార్థులు, వక్తలకు, ఎన్‌సీసీ సభ్యులకు కలెక్టర్ జ్ఞాపికలు అందించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీవాణి, అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, డీఎల్ఎస్ఏ సెక్రటరీ రాధిక, జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు, ఎంఈవోలు, పాఠశాలల హెచ్ఎంలు, అధికారులున్నారు.



ఫిర్యాదుదారులు తెలిపిన వివరాలు నమోదు చేసుకుంటున్న ఎస్పీ

బాధితులకు సత్వర న్యాయం చేయాలి: ఎస్పీ

భైంసా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వివిధ చట్టపరమైన సమస్యలతో పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితులకు పోలీసు అధికారులు కాలయాపనకు తావులేకుండా సత్వర న్యాయం అందేలా చర్యలు చేపట్టాలని ఎస్పీ డా.జానకీ షర్మిల ఆదేశించారు. బుధవారం భైంసాలోని తన క్యాంపు కార్యాలయంలో గ్రీవేన్స్ డే సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయా ఫిర్యాదులను సంబంధిత పోలీసుస్టేషన్ ఎస్సైలకు వివరించి పరిష్కరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై దిశానిర్దేశం చేశారు. బాధితులకు చట్టపరంగా అవసరమైన సహాయాన్ని వెంటనే అందించాలని సూచించారు. ఇదేక్రమంలో గ్రీవెన్స్ డేలో భాగంగా ఇదివరకు స్వీకరించిన ఫిర్యాదులు, వాటిలో పరిష్కరించిన, పెండింగ్‌లోనున్న వాటిపై ఆయా పోలీసుస్టేషన్ల ఎస్సైలతోసమీక్షించారు. పెండింగ్‌లోనున్న ఫిర్యాదులను విధానాలకు తావులేకుండా పరిష్కరింప చేయాలన్నారు. బుధవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డే వివిధ పోలీసుస్టేషన్ల పరిధిఉంచి 17 మంది అర్జీదారులు ఎస్పీ డా.జానకీ షర్మిలకు ఫిర్యాదులను స్వీకరించారు.



జిల్లాకేంద్రంలో ర్యాలీలో పాల్గొన్న కార్మికులు



దిలావర్‌పూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు, ఆశాలు



భైంసాలో పాల్గొన్న ఐఎఫ్‌టీయూ, టీయూసీఐ ప్రతినిధులు

కార్మికవర్గ హక్కులను కాపాడుకుందాం

- దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక సంఘాల నాయకులు
- జిల్లావ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు

నిర్మల్‌టౌన్, జూలై9 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లాకేంద్రంలో టీయూసీఐ ఆధ్వర్యంలో ముందుగా భగత్‌సింగ్ భవన్ నుండి డీఎస్ మార్ట్, శివాజీ చౌక్, టీఎస్ ఆర్టీసీ బస్ డిపో మీదుగా ఆర్డీవో కార్యాలయం వరకు కార్మికులతో నినాదాలు ఇస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు కట్ల రాజన్న మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని అలాగే అన్ని రంగాల్లో పని చేసే కార్మికులకు కనీస వేతనాలు నెలకు రూ.26వేల చెల్లించాలన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ రాష్ట్ర నాయ కులు శ్రీనివాస చారి, భూక్యా రమేష్, టీయూసీఐ జిల్లా సహాయ కార్యద ర్శి ఎస్. గంగన్న, బ్యాంక్ మేనేజర్ రాథోడ్ శ్రీరామ్ నాయక్, పీవోడబ్ల్యూ జిల్లా కార్యదర్శి కట్ల లక్ష్మీ, లక్ష్మీ, టీయూసీఐ జిల్లానాయకులు ఎస్.లక్ష్మీ, మహేందర్, కిరణ్, గంగామణి, కిషన్, పోశెట్టి, రాజన్న, రాజు, కార్మికులు పాల్గొన్నారు.

దిలావర్‌పూర్: కేంద్ర ప్రభుత్వం కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని సీఐటీయూ నాయకురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం సార్వత్రిక సమ్మెలో భాగంగా దిలావర్‌పూర్ మండల తహసీల్దార్ కార్యాలయం ముందు సీఐటీయూ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు ధర్నా చేశారు. అనంతరం ర్యాలీగా 61వ జాతీయ రహదారిపై రాస్తారోకో చేశారు. దేశంలో కేంద్ర ప్రభుత్వం పేదోళ్ల పొట్ట కొట్టి ఉన్నోళ్లకు పెడుతుందని సీఐటీయూ నాయకురాలు విజయలక్ష్మి విమర్శించారు. జీవో నెంబర్ 282ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అవర్గ ముత్యం, వివిధ గ్రామాల అంగన్‌వాడీ టీచర్లు, ఆశా వర్కర్లు, ఆయాలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు పాల్గొన్నారు.

కడెం: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కడెం మండల కేంద్రంలో వివిధ రంగాల కార్మికులు నిరసన తెలిపి ర్యాలీ నిర్వహించారు. కార్మిక చట్టాలను యధావిధిగా పునరుద్ధరించాలన్నారు. వెంటనే కార్మిక రంగాన్ని అభివృద్ధిపరిచేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని పేర్కొన్నారు.

ఖానాపూర్: కేంద్రం తెచ్చిన నాలుగు లేబర్ కొడ్లను రద్దు చేసే వరకు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరంతర పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ నిర్మల్ జిల్లా అధ్యక్షురాలు గంగామణి అన్నారు. బుధవారం కార్మిక సంఘాల పిలుపు మేరకు సార్వత్రిక సమ్మెలో భాగంగా ఖానాపూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక తెలంగాణ తల్లి చౌరస్తాలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు, ఆశా వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, ఆయా కార్మిక వర్గాలు పాల్గొన్నారు.

బాసర: దేశవ్యాప్త సమ్మె నేపథ్యంలో బాసర మండలంలో కార్మికుల సేవలు నిలిచిపోయాయి. పారిశుధ్య కార్మికులు, ఆశావర్కర్లు, పలు బ్యాంకుల్లో సేవలందిస్తున్న సిబ్బంది సమ్మెలో పాల్గొన్నారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద పారిశుధ్య కార్మికులు ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి చేరుకొని తహసీల్దార్ పవనచంద్రకు వినతిపత్రం సమర్పించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్లను రద్దుచేయాలని డిమాండ్ చేశారు.

ముథోల్: 4 లేబర్ కోడ్లను రద్దుచేయాలని సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు ముథోల్‌లో రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అంతకుముందు ప్రదర్శన ర్యాలీ చేపట్టారు. ప్రభుత్వాలు తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా మాజీ అధ్యక్షుడు పోశెట్టి, రేష్మ, ఆశా వర్కర్లు, గ్రామ పంచాయతీ కార్మికులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: కేంద్రప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ అంగన్‌వాడీలు, ఆశావర్కర్లు బుధవారం సమ్మె చేశారు. కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని, లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వేస్లీ, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భైంసా: దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బుధవారం భైంసాలో వివిధ సంఘాలు చేపట్టిన కార్యక్రమాలు హోరెత్తాయి. తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ శ్రేణులు విధులకు హాజరు కాకుండా సార్వత్రిక సమ్మె చేపట్టారు. స్థానిక కోఆపరేటివ్ బ్యాంక్ ఎదుట సంబంధిత ఎంప్లాయిస్ అసోసియేషన్ నిరసన ప్రదర్శనలు చేపట్టింది. ఉద్యోగులను కట్టు బానిసలుగా మార్చే కారక్మిక కోడ్లను వెంటనే ఉపసంహరించి సహకార బ్యాంకులలో వ్యవస్థాగత మార్పులు చేపట్టాలని యూనియన్ డిమాండ్ చేసింది. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎం.హరిత, టీయూసీఐ రాష్ట్ర ప్రతినిధిరామ్ లక్ష్మణ్, కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీలో పొంగిపొర్లుతున్న వాగులు

● ఆదివాసీ, గిరిజనులకు తప్పని తిప్పలు



వంకతుమ్మ వాగులో నుంచి వెళ్తున్న గిరిజనులు



నర్సాపూర్ వాగులో నుంచి భయంభయంగా దాటి వెళ్తున్న గిరిజనులు

ఉట్నూర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాలో వానాకాలం వచ్చిందంటే చాలు మారుమూల గిరిజన గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచిపోతున్నా.. గ్రామీణ ప్రాంతాల ప్రజల ఆశలు రోడ్లు కరువై, వంతెనలు లేక అగమ్య గోచరంగా సాగుతున్నాయి. దేవుడు వరమిచ్చినా.. కరుణించని పూజారి చందంగా ప్రభుత్వం వంతెనల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తుంటే అటవి శాఖ అడ్డంకులు గిరిజనులకు కష్టాలు తెచ్చిపెడుతున్నాయి. ఉట్నూర్ మండలంలోని వంకతుమ్మ గ్రామానికి శీతకాలంలో ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ వెళ్లడానికి సరైన రోడ్డు మార్గంలేక, వాగులో బండరాళ్ల మధ్య కాలినడకన వెళ్లి ఆ తర్వాత ట్రాక్టర్ పై ప్రయాణం సాగించి గ్రామాన్ని సందర్శించారు. వంక తుమ్మ గ్రామానికి అడ్డుగా ఉన్న వంక తుమ్మ వాగు పై వంతెన మంజూరు చేయించడానికి కృషి చేసినప్పటికి అటవి శాఖఅడ్డంకులు ఏ ర్పడ్డాయి. గత ఐదేళ్ల క్రితం వంక తుమ్మకు చెందిన గర్భిణిని ప్రసవ సమయంలో ఆసుపత్రికి తరలించడానికి ప్రయత్నిస్తుండగా వాగు దాట నీయక పోవడంతో వైద్యం అందక గర్భిణి మృతి చెందంది. అదే విధంగా పాటగూడకు చెందిన గిరిజనుడు ఒకరు పాముకాటుకు గురై వైద్యం అందుకోలేక మృత్యువాత పడ్డాడు.

అదే విధంగా మండలంలోని నరసాపూర్(జె) గ్రామ పంచాయతీకి వెళ్లె మార్గంలో వాగుల పైన రెండు వంతెనల నిర్మాణం సాగినప్పటికి ఒక వంతెన అటవీ శాఖ సరిహద్దులో ఉందంటూ గత ఐదేళ్ల కాలంగా అటవి శాఖ అధికారులు అడ్డంకులు తెలపడంతో వంతెన నిర్మాణం ప్రారంభించ లేదు. ఫలితంగా ప్రతియేటా వర్షాకాలంలో వాగు ప్రవహిస్తున్న సమయంలో నర్సాపూర్, ఆడగూడ గ్రామాల గిరిజనులు బాహ్య ప్రపంచానిక దూరంగా ఉండిపోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. అంతేకాకుండా ఏవైనా వ్యాధులు సోకితే ఆశ కార్యకర్త వద్ద ఉన్న మందులతో పాటు అందుబాటులో ఉన్న నాటు వైద్యం వాడుకుంటున్నారు. గత సంవత్సరం వర్షాకాలంలో నర్సాపూర్‌కు చెందిన గిరిజనుడు ఒకరు అనారోగ్యంతో రిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందగా.. మృతదేహాన్ని జీపులో నర్సాపూర్ వాగు వద్దకు తీసుకువచ్చి అక్కడి నుంచి ఎడ్లబండిపై శవాన్ని గిరిజనులు తరలించారు. ఇలా ప్రతీయేటా గిరిజనులు ఇబ్బందులు పడుతునే ఉన్న వారి ఆర్తనాదాలు అడవులకే పరిమితం అవుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు వాగుల పై వంతెనల నిర్మాణం కోసం అటవీ శాఖ అడ్డంకులు తొలగించేలా చూడాల్సిన అవసరం ఉందని పరిశీలకులు అంటున్నారు.

ముదురుతున్న.. ప్రొటోకాల్ వివాదం!

(5వ పేజీ తరువాయి...)

ప్రాధాన్యతను ఇవ్వద్దంటూ జిల్లా యంత్రాంగానికి డైరెక్షన్ ఇచ్చినట్లు తెలుస్తుంది. చిన్నపాటి కార్యక్రమాలను ప్రజాప్రతినిధుల ప్రమేయం లేకుండా అధికారులే పూర్తి చేసుకోవాలంటూ సూచించినట్లు తెలిసింది. ఇకపై తనకు తెలియకుండా ఎలాంటి ఉద్యోగుల బదిలీలు, పోస్టింగులు, నిధుల కేటాయింపు, సిఫారసులు, ప్రారంభోత్సవాలను చేపట్టరాదుంటూ అధికారులను హెచ్చరించినట్లు సమాచారం. ప్రతిపక్షాలకు ప్రాధాన్యతను ఇస్తే ప్రజల్లోకి తప్పుడు సంకేతాలు వెళ్లే అవకాశం ఉంటుందని కాంగ్రెస్ భావిస్తుంది. అయితే ఇదంతా బాగానే ఉన్న ప్రొటోకాల్ ప్రకారం స్థానిక ప్రజాప్రతినిధులను అధికారిక కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేయాల్సిన బాధ్యత జిల్లా అధికారులపై ఉందన్న వాదనలు బలంగా వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ నియోజకవర్గంలో ముదురుతున్న ప్రొటోకాల్ విషయంపై త్వరలోనే ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

దూకుడుకు చెక్ పెట్టేందుకేనా?

ప్రతిపక్షాలకు చెక్ పెట్టేందుకే జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారన్న ప్రచారం జరుగుతుంది. మంత్రి తొలిసారి పర్యటనలోనే భారీ మార్పు కనిపించిందన్న టాక్ వినిపిస్తుంది. పార్టీ లైన్‌లోనే ముందుకెళ్తున్నట్లు చర్చ జరుగుతుంది. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయి. గతంలో ఇన్‌చార్జి మంత్రిగా పని చేసిన మంత్రి సీతక్క పనితీరుపై సొంత పార్టీ నేతలే గతంలో అభ్యంతరాలను వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఇందిరమ్మ కమిటీల్లో ప్రతిపక్షాలకు అవకాశం కల్పించడం, బీఆర్ఎస్, బీజేపీ ఎమ్మెల్యేలకు సైతం సమానంగా నిధులు కేటాయించడం. కొన్నిచోట్ల ఎమ్మెల్యేలకు ప్రత్యేక నిధులు కేటాయించడం పై కాంగ్రెస్ నేతలను తీవ్ర అసంతృప్తికి గురిచేసింది. ఇచ్చోడ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కొంతమంది సీనియర్ నేతలు సీతక్క ముందే ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిదే. అయితే ఇలాంటి పరిస్థితులకు భిన్నంగా మంత్రి జూపల్లి ముందుకెళ్తున్నట్లు కాంగ్రెస్ వర్గాల్లో చర్చ జరుగుతుంది.



మాట్లాడుతున్న ఏఎంవో ఆత్రం జగన్

ఆశ్రమ పాఠశాలల్లో పకడ్బందీగా ఈఎల్‌పీ అమలు : ఏఎంవో

ఉట్నూర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బు గుప్తా ఆదేశాల మేరకు ఉమ్మడి జిల్లాలోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలలో ఇంగ్లీష్ లిటరేచర్ ప్రోగ్రాం(ఈఎల్పీ) పకడ్బందీగా అమలు చేయనున్నామని ఐటీడీఏ అకాడమిక్ మోనిటరింగ్ ఆఫీసర్ ఆత్రంజగన్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావేశ మందిరంలో ఆశ్రమ పాఠశాలల టీచర్లకు శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించామన్నారు. ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల ఉపాధ్యాయులకు ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలో, కొమురంభీం ఆసిఫాబాద్ మంచిర్యాల జిల్లాల ఉపాధ్యాయులకు గురువారం ఆసిఫాబాద్‌లో ఈఎల్‌పీ శిక్షణ ఇస్తున్నామన్నారు. మూడవ తరగతి నుంచి 5వ తరగతి విద్యార్థులకు ఈఎల్‌పీ కార్యక్రమం ద్వారా ఇంగ్లీష్ భాషపై ప్రావీణ్యం పెంపొందించే విధంగా విభా ఆఫ్ పర్ వర్డ్ వారి సహాకారంతో అమలు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమం అమలు కోసం ప్రత్యేక పర్యవేక్షణ రిసోర్స్ పర్సన్లను నియమించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల అధికారి కోరెడ్డి పార్థసారథి, నిర్మల్ ఏసీఎంవో శివాజీ, పీఎంఆర్ సిబ్బంది చాయ, దేవరావు, తదితరులు పాల్గొన్నారు.



మంత్రి సీతక్కను సన్మానించి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

మంత్రి సీతక్క జన్మదిన వేడుకల్లో పాల్గొన్న బోరంచు శ్రీకాంత్‌రెడ్డి

ఆదిలాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క జన్మదిన వేడుకల్లో రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బి.శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. ములుగు నియోజకవర్గంలో నిర్వహించిన వేడుకల్లో పాల్గొని మంత్రికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రిని శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఆయన వెంట ప్రఫుల్‌రెడ్డి, షేక్ ఇమామ్, ధర్మపురి చంద్రశేఖర్, గోవర్ధన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ ఆధ్వర్యంలో మంత్రి సీతక్క జన్మదిన వేడుకలను కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకోవడం జరిగింది. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అబ్బో మెరుగు భక్షజన్న, దొర శేఖర్, మేర గంగాధర్, పి.చంటి, పడిగెల భోజన్న, గడ్డల నారాయణ, వడ్ల కొండ సురేందర్ స్వామి రెడ్డి, మెరుగుదాసు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెతో బ్యాంకుల మూత

బోథ్, జూలై 9(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెతో బోథ్ సోనాల మండలంలోని బ్యాంకులు పని చేయలేదు విషయం తెలియక పోవడంతో బ్యాంకు వినియోగదారులు తిరిగి వెళ్లి పోయారు. కాగా బ్యాంకులు తప్ప మిగత ప్రభుత్వ కార్యాలయాన్ని యదావిధిగా పని చేశాయి.

ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడిగా ఏవో?

ఆదిలాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ వ్యక్తిగత సహాయకుడిగా (పీఏ) ఆదిలాబాద్ అర్బన్ ఏవో వివేక్‌ను నియమిస్తున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే వివేక్ నియమకాన్ని ఖరారు చేస్తూ వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు సిద్ధం చేసినట్లు సమాచారం. త్వరలోనే వివేక్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే పీఏగా అధికారికంగా విధులు నిర్వహించనున్నారు. దీని పై జేడీఏ శ్రీధర్‌స్వామిని ఫోన్‌లో వివరణ కోరగా అందుబాటులోకి రాలేదు.

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్న లారీ పట్టివేత

బోథ్, జూలై 9(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రానికి అనుమతులు లేకుండా నిర్మల్ జిల్లా సోఫీనగర్ నుంచి ఇసుకను తీసుకువస్తున్న లారీ టీఎస్08యూఏ3115 నెంబర్ లారీ బోథ్ సమీపంలో బుధవారం ఉదయం పట్టుకోవడం జరిగిందని సీఐ వెంకటేశ్వర్లు ఎస్సై ప్రవీణ్‌లు తెలిపారు. దాదాపు 40 టన్నుల ఇసుకను నిర్మల్‌కు చెందిన మజీద్ బోథ్‌కు చెందిన ఇజాజ్ అనే వ్యక్తికి ఈ ఇసుక లారీని తీసుకు వస్తున్నట్లు డ్రైవర్ ధరమ్‌సింగ్ తెలిపారు అన్నారు. అనుమతులు లేకుండా ఇసుక తరలించిన లారీలలో తీసుకువచ్చిన కేసులు తప్పవని సీఐ, ఎస్సైలు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వారు వివరించారు.



వడగామ్‌లో బెల్ట్ షాపును మూసి వేయించిన మహిళలు

బెల్ట్ షాపుల తొలగింపునకు తీర్మానం

ఇంద్రవెల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వడగామ్ గ్రామ పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో బెల్ట్ షాపుల రద్దుకు బుధవారం వడగామ్ వీవో మహిళ సంఘాల ఆధ్వర్యంలో తీర్మానం చేశారు. అనంతరం బెల్ట్ షాపులు నిర్వహిస్తున్న గ్రామాలకు సందర్శించి బెల్ట్ షాపు నిర్వాహకులకు హెచ్చరించి షాపులను బంద్ చేయించారు. ఇక నుంచి వడగామ్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏ గ్రామంలోనైనా బెల్ట్ షాపులు నిర్వహిస్తే మహిళా సంఘాల ఆధ్వర్యంలో దుకాణలపై దాడులు నిర్వహించి ధ్వంసం చేయడంతో పాటు రూ.50 వేలు జరిమానా విధిస్తామని వారు ఈ సందర్భంగా హెచ్చరించారు. అంతేకాకుఒండా పోలీసు శాఖ, ఎక్సైజ్ శాఖ నిర్లక్ష్యం కారణంగా గ్రామాల్లో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు ఏర్పాటు చేయడంతో గ్రామీణ ప్రాంత యువత మద్యపానానికి గురవుతున్నారని ఆరోపించారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌లు దృష్టి సారించి గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్ట్ షాపుల తొలిగించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘాల సభ్యులు భీంబాయి, విజయలక్ష్మీ, సోన్‌దేవి, కలబాయి, రత్తుబాయి, నీలాబాయి, ఉమబాయి, లక్ష్మీబాయి, కౌసుబాయి, సీతాబాయి, దేవుబాయి, రూపాబాయి, లచ్చుబాయి, సోంబాయి, తదితరులు పాల్గొన్నారు.

జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి

● బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్

ఖానాపూర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : ప్రతీ ఏడాది జూలైలో మొదటి, రెండువారాల్లో ఖానాపూర్‌లో జాబ్ మేళా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్‌నాయక్ తెలిపారు. బుధవారం పట్టణంలోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడారు. ఈనెల 12న ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న మెగాజాబ్ మేళాను 8 మండలాల యువత రాజకీయాలకు అతీతంగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. 20 ఏళ్లుగా సాఫ్ట్‌వేర్ రంగంలో ఉన్నానని, నిరుద్యోగ యువత సమస్యలు పూర్తిగా తెలుసునన్నారు. అందుకే ఖానాపూర్ ప్రాంతంలోని ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్, జన్నారం, ఉట్నూర్, ఇంద్రవెల్లి, సిరిచెల్మాల్లోని నిరుద్యోగుల కోసం జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

గోడ ప్రతులను విడుదల చేసిన కొణతం దిలీప్

మెగా జాబ్‌మేళాకు సంబంధించిన గోడ ప్రతులను గత ప్రభుత్వ డిజిటల్ మీడియా మాజీ డైరెక్టర్ దిలీప్ ఆవిష్కరించి మాట్లాడారు. నిరుద్యోగ యువతకు అండగా నిలిచేందుకు జాన్సన్‌నాయక్ చేపట్టిన జాబ్‌మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. వేర్వేరుగా నిర్వహించిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, మాజీ జడ్పీటీసీ రాథోడ్ రాము నాయక్, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, మాజీ వైస్ ఎంపీపీ గుగ్లావత్ వాల్ సింగ్, మండల అధ్యక్షులు తాళ్లపెల్లి రాజగంగన్న, పట్టణ అధ్యక్షులు గౌరీకర్ రాజు, తదితరులున్నారు.

'గ్రామ పరిపాలన అధికారి నియామకాల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం ఇవ్వాలి'


నిర్మల్ రూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పరిపాలన అధికారి నియామకాల్లో వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం ఇవ్వాలని వీఆర్ఏ జేఏసీ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట మహాధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... జీవో నెంబర్ 81, 85 ప్రకారం 61 సంవత్సరాలు పూర్తయిన వీఆర్ఏ వారసులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని, గ్రామ పరిపాలన అధికారి నియామకాలను వీఆర్ఏ వారసులకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. గతంలో వీఆర్ఏ వారసులకు ఉద్యోగాలు కేటాయిస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి మాట నిలబెట్టుకోవాలని వారు కోరారు.

పోగొట్టుకున్న నగదు బాధితుడికి అప్పగింత

నిర్మల్‌రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): పోగొట్టుకున్న 2లక్షల 48వేల నగదును బాధితుడికి అప్పగించినట్లు ఎస్పీ జానకి షర్మిల తెలిపారు. ఈనెల 8న ఓ వ్యక్తి బైక్ నడుపుతూ ఫోన్‌లో మీట్లాడుతుండగా తన బైక్‌పౌచ్ నుంచి రూ. 2లక్షల 48వేల జారీ పడిపోయాయని, ఈ దృశ్యాన్ని గమనించిన విజయ్ కుమార్ అనే వ్యక్తి వాహనదారుడిని పలుమార్లు పిలిచినా వినకుండా వెళ్లిపోయాడు. విజయ్ కుమార్ ఆ నగదును ఎస్పీ డా.జి. జానకీ షర్మిలను కలిసి నగదును అప్పగించి తన నిజాయితీని చాటుకున్నాడు. బాధితుడు నగదు కోల్పోయిన విషయాన్ని గ్రహించి వెంటనే పోలీసులను సంప్రదించాడు. దీనిపై ఎస్పీ స్పందించి తక్షణమే సాంకేతిక ఆధారాలతో కూడిన విచారణ చేసి బాధితుడిని గుర్తించి నగదు అప్ప గించేందుకు చర్యలు చేపట్టారు. ఎస్పీ చేతుల మీదుగా నగదును బాధితుడికి అప్పగించారు. ఇంతతక్కువ సమయంలో కోల్పోయిన డబ్బును తిరిగి అప్పగించినందుకు బాధితుడు ఎస్పీ, పోలీసులకు కృతజ్ఞతలు తెలిపాడు.

వైభవంగా గోరింటాకు పండుగ

ముథోల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని శ్రీ సరస్వతీ శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో ఆషాఢమాస గోరింటాకు పండుగను వైభవంగా జరుపుకున్నారు. పిల్లలే స్వయంగా ప్రకృతి నుండి గోరింటాకు సేకరించి వాటిని నూరి గోరింటాకు తయారు చేశారు. అనంతరం ఆ గోరింటాకును తన తోటి మిత్రుల అరచేతులకు పెట్టి ఆనందాన్ని వ్యక్తంచేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ గోడం నగేష్



సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు

ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి

● పథకాల అమలులో పారదర్శకత అవసరం : ఎంపీ గోడం నగేష్

నిర్మల్‌రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాలను గ్రామీణ ప్రజలకు సమర్థవంతంగా అందించేలా అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని పార్లమెంట్ సభ్యులు గోడం నగేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ఆదిలాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి సంబంధించిన డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ కోఆర్డినేటర్ అండ్ మానిటరింగ్ కమిటీ (దిశా) సమావేశానికి ఎంపీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ... గ్రామీణాభివృద్ధికి, పేద ప్రజల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని, ఆవి పూర్తిస్థాయిలో పారదర్శకంగా అమలు చేయాలని స్పష్టం చేశారు. ఆర్టికల్ 275(1), సీసీడీపీ (కంప్రహెన్సివ్ కన్జర్వేషన్ అండ్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం), ఎంపీసీ (మిషన్ ఫర్ ప్రొటీన్ చెయిన్) వంటి పథకాల కింద జిల్లాకు వచ్చిన నిధులను సద్వినియోగం చేయాలని ఆదేశించారు. జాతీయ ఉపాధిహామీ పథకం కింద అర్హులైన ప్రతి ఒక్కరికి జాబ్ కార్డులు జారీచేయాలన్నారు. ప్రతీ కూలీకి వంద రోజుల పనిదినాలు కల్పించాలన్నారు. ఉపాధి హామీ పథకానికి అనుసంధానంగా జిల్లాలో చేపట్టిన రోడ్లు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, డ్రైనేజీ కాల్వల నిర్మాణానికి అనుమతులు లభించిన వెంటనే పనులు ప్రారంభించాలని, వెల్లడించిన నిధులను సమర్థవంతంగా వినియోగించి పనులు వేగంగా పూర్తి చేయాలని స్పష్టంచేశారు. అధికారులంతా ప్రతి పనిని స్వయంగా తనిఖీ చేసి, పనులన్నింటినీ పారదర్శకంగా, నాణ్యతతో పూర్తి చేయాలని, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు ప్రణాళికబద్ధంగా, సమగ్రంగా కృషి చేయాలని ఆయన పేర్కొన్నారు. ప్రధాన మంత్రి అమృత్ 2.0, పీఎం కిసాన్ సమ్మాన్ యోజన, పీఎం శ్రీ పథకాలను గుణాత్మకంగా అమలు చేయాలన్నారు. పట్టణ ప్రాంతాలకు తాగునీటి సరఫరా కోసం చేపట్టిన నీటి ట్యాంకుల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ యోజన (పీఎం కిసాన్) పథకానికి జిల్లా అర్హత కలిగిన రైతులందరికీ తప్పనిసరిగా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని, పథకానికి అర్హత కలిగిన ప్రతి రైతుకు లబ్ధి అందేలా వ్యవస్థను పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ జతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంజీఎన్ఆర్ఈజీఎస్) కింద అర్హులైన ప్రతి ఒక్కరికి వంద రోజుల పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నూతనంగా 36 అంగన్‌వడీ భవనాలు నిర్మాణానికి అనుమతులు లభించాయని, ఇప్పటి వరకు 20 భవన నిర్మాణాలు పూర్తి అయ్యాయని తెలిపారు. సమవేశంలో శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి (నిర్మల్), పవార్ రామారావు పటేల్ (ముథోల్), వెడ్మ బొజ్జు పటేల్ (ఖానాపూర్), అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు, పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పెంబి, జూలై9 (ఆంధ్రజ్యోతి): పెండింగ్ వేతనాలు చెల్లించి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వ్యవసాయ కార్మికసంఘం జిల్లాఉపాధ్యక్షుడు సుంచుల నారాయణ అన్నారు. దేశవ్యాప్తసమ్మెలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు 4లేబర్‌కోడ్లను రద్దుచేయాలని, కనీసవేతనం రూ.26వేలుగా నిర్ణయించాలన్నారు. సమానపనికి సమాన వేతనం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో పెంబి మండల కార్యదర్శి మల్లేష్, కార్మికులు మమత, వినోద్, కారోబార్ జగన్, ప్రేమలత, జ్యోతి, గోధూరి గంగయ్య, మల్లయ్య, రాజన్న, రాజు, అంగన్‌వాడీలు ఉన్నారు.

తానూర్ : దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భాగంగా తానూర్‌లో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెలో మండలంలోని కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఐటీయూ మాజీ జిల్లా అధ్యక్షుడు పోశెట్టి హాజరై మాట్లాడారు. కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలు మానుకోవాలన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన నాలుగు లేబర్‌కోడ్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశాకార్యకర్తలు, సరిత, ముత్తవ్వ, అంగన్‌వాడీలు సావిత్రి, లక్ష్మీ, శారద, తదితరులు పాల్గొన్నారు.

కుంటాల: ప్రభుత్వం ఆశాకార్యకర్తల న్యాయమైన డిమాండ్లన్నింటిని పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట కల్లూరు- కుంటాల రహదారిపై ధర్నా నిర్వహించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల ఇచ్చిన పిలుపు మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ఆశా కార్యకర్తలు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు రూ. 26 వేల వేతనంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించి అన్ని విధాల ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

కుభీర్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని ఎంపీడీవో సాగర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలో ఫైవేటుప్రాజెక్టుగా ఎంపిక చేసిన అంతర్నిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణం నిర్ణిత గడువులోగా పూర్తిచేయాలని సూచించారు. గ్రామంలో మొత్తం 54మంది లాబ్ధిదారులకు ప్రభుత్వం ఇళ్లు మంజూరైనట్లు చెప్పారు. ఇప్పటి వరకు 21 మంది లబ్ధిదారులకు మొదటివిడతగా రూ.లక్ష ఒక్కొక్కరికి అందించామన్నారు. అనంతరం గ్రామంలో పారిశుధ్య వ్యవస్థను పరిశీలించారు. సీజనల్ వ్యాధులు సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అధికారులు ఎంపీవో మోహన్‌రెడ్డి, జీపీ కార్యదర్శి విజయ్‌కుమార్ ఉన్నారు.

మీసేవలో అదనంగా డబ్బు వసూలు చేయొద్దు

కుంటాల, జూలై9 (ఆంధ్రజ్యోతి): మీసేవ కేంద్రాల్లో వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయొద్దని తహసీల్దార్ కమల్‌సింగ్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని ఆయా గ్రామాల్లోని మీసేవా నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మీసేవా కేంద్రాలకు వచ్చే నిరక్ష్యరాస్యులు, రైతులు, వినియోగదారుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేయకూడదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీటీ నరేష్‌గౌడ్, సిబ్బంది ఉన్నారు.




వినతి పత్రాలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే పవార్ రామారావ్

విద్యా, వైద్యం, సాగునీటి కల్పనకు పెద్దపీట

● ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్

భైంసా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలో విద్యా, వైద్యం, వ్యవసాయ రంగాలకు సాగునీటి కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తున్నట్లుగా ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్ తెలిపారు. బుధవారం భైంసాలోని క్యాంపు కార్యాలయంలో నియోజక వర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలవాసుల నుంచి సమస్యలకు సంబంధించిన వినతిపత్రాలు స్వీకరించిన సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. వ్యవసాయ రంగానికి సాగునీటిని కల్పించేందుకు గాను దెబ్బతిన్న చెరువులకు, నిరూపయోగంగా మారిన ఎత్తిపోతల పథకాల మరమ్మత్తులకు అవసరమైన నిధుల మంజూరు చేయించినట్లుగా పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల్లో పతానవస్థ దశకు చేరుకున్న ప్రభుత్వ పాఠశాలల భవనాలకు నూతన భవనాలను నిర్మింప చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తున్నామని వివరించారు. బస్తీ దవాఖానాలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఖాళీగానున్న వైద్యాధికారులు, సిబ్బంది పోస్టుల భర్తీకి అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆయా ప్రాంతాలవాసుల నుంచి స్వీకరించిన వినతులను సంబంధిత మండల శాఖాధికారులను నివేదించి పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు.

విద్యుత్ షాక్‌తో నాలుగు గొర్రెల మృత్యువాత



మృత్యువాత పడిన గొర్రెలు

దిలావర్‌పూర్, జూలై9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాల్వ గ్రామ శివారులోని ట్రాన్స్ ఫార్మర్ వద్ద విద్యుత్ షాక్‌తో నాలుగు గొర్రెలు మృత్యువాత పడ్డాయి. గ్రామానికి చెందిన కుర్మె సురేష్ తన గొర్రెల మందను మేపేందుకు కాల్వ గ్రామ శివారులో ఉన్న చెరువు కట్టవైపు వెళ్లాడు. కాగా గొర్రెలు చెరువు కట్ట చివరన ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేస్తుండగా ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఎర్తింగ్ తీగ తగిలి మృత్యువాత పడ్డాయి. బాధితుడికి నష్ట పరిహారం ఇవ్వాలని, నిర్లక్ష్యం చేసిన విద్యుత్ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు.

ఘనంగా గురు పౌర్ణమి ఉత్సవాలు

నిర్మల్‌రూరల్, జూలై9 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శ్రీ నందిగుండం దుర్గామాత ఆలయంలో గురుపౌర్ణమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయని ఆలయ వ్యవస్థాపకులు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ వ్యవస్థాపకులు కే.వెంకటాచార్యుల దంపతులను బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్ ఘనంగా సత్కరించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పెంబి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని లోతర్య గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు రూప్ సింగ్ తండ్రి, ఇటిక్యాల్ గ్రామానికి చెందిన రజిత అనారోగ్యంతో మృతి చెందగా బుధవారం బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భూక్యా జాన్సన్ నాయక్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నల్ల నరేందర్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు గంగారెడ్డి, గోవింద్, మహేందర్, తదితరులు ఉన్నారు.



ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పూర్తయిన మోడల్ ఇందిరమ్మ ఇళ్లు

చురుగ్గా ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు

- 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మాణం
- ఒక్కో మోడల్ నిర్మాణానికి రూ.5 లక్షల వ్యయం
- ప్రతీ ఎంపీడీవో కార్యాలయ అవరణలో ఏర్పాటు

భైంసా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపడుతున్న మోడల్ ఇందిరమ్మ ఇంటి ఆధారంగానే లబ్ధిదారులు ఇళ్ల నిర్మించుకునేలా అధికారులు చర్యలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే రూ. 5లక్షల సాయంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేస్తున్నారు. లబ్ధిదారులకు అందుబాటులో ఉండేలా ప్రతి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో నిర్మించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది.

● రూ. 5లక్షల సాయంలోనే ఇంటి నిర్మాణం పూర్తయ్యేలా..

ఒక్కో లబ్ధిదారుడికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5లక్షలు కేటాయించనుంది. సంబంధిత రూ. 5లక్షలతోనే ఏ విధంగా ఇల్లు నిర్మించుకోవచ్చనేది ప్రయోగాత్మకంగా చూపడానికే ఇందిరమ్మ నమూనా ఇళ్లను తయారు చేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలోని ఆయా మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల అవరణలో వీటి నిర్మాణాలు చురుగ్గా కొనసాగుతున్నాయి. 400 చదరపు అడుగుల విస్తీర్ణంలో మోడల్ ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు.

● మూడు మండల కేంద్రాల్లో పూర్తి..

హౌసింగ్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ కె.రాజేశ్వర్ పర్యవేక్షణలో ఆయా మండలాల్లోని ఎంపీడీవో కార్యాలయాల అవరణలో ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ఇప్పటికే భైంసా, ఖానాపూర్, లక్ష్మణ్‌చాంద మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల అవరణలో మోడల్ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. ఇక మామడ, సారంగాపూర్ మండల కేంద్రాల్లో వీటి నిర్మాణాలు స్లాబ్ లెవల్ దశ పూర్తవ్వగా దిలావర్‌పూర్, పెంబి మండల కేంద్రాల్లో రూఫ్ లెవల్ స్థాయికి చేరుకున్నాయి. సోన్, లోకేశ్వరం మండల కేంద్రాల్లో లెంటల్ లెవల్ దశకు చేరుకోగా కుంటాల, ముథోల్, కడెం మండల కేంద్రాల్లో మోడల్ ఇళ్ల నిర్మాణాలు బెస్మెంట్ స్థాయిలో ఉన్నాయి. తానూర్, కుబీర్ మండల కేంద్రాల్లో పిల్లర్ల స్థాయిలో ఉండగా దస్తూరాబాద్ మండల కేంద్రాల్లో మార్కవుట్ స్థాయి పూర్తయింది. ఇక బాసర, నర్సాపూర్(జి), నిర్మల్ కేంద్రాల్లో స్థలం లేకపోవడం మూలంగా ఈ కేంద్రాల్లో ఇంకా ఇందిరమ్మ మోడల్ ఇళ్ల నిర్మాణపు ప్రక్రియ మొదలు కాలేదు.



తలమడుగు మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్


తలమడుగు రైల్వే స్టేషన్‌లో ముళ్ల పొదలు, చెత్తాచెదారంతో నిండిన దృశ్యం

తలమడుగు రైల్వే స్టేషన్‌లో సమస్యల తిష్ఠ

- కనీస సౌకర్యాలు కరువు
- హామీలకే పరిమితమైన నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం
- ఆగని ఎక్స్‌ప్రెస్ రైలు


రైల్వే స్టేషన్‌లో వెలగని విద్యుత్ దీపాలు

తలమడుగు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండల కేంద్రంలో గల రైల్వే స్టేషన్‌లో పలు సమస్యలు ఉన్న ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలో 50 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన రైల్వే స్టేషన్ లో ప్రయాణికులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయడం లేదు. గత 50 ఏళ్ల క్రితం నిర్మించిన రేకుల షెడ్డులోనే ప్రయాణీకులు, రైలు బండి కోసం వేచి చూస్తున్నారు. అదేవిధంగా విద్యుత్ దీపాలు సక్రమంగా లేక పోవడం రాత్రిపూట ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. అదే విధంగా రైల్వే స్టేషన్ తాగునీటి సౌకర్యం లేక దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రయాణికులకు తాగునీటి ఇక్కట్లు తప్పడం లేదు. అంతేకాకుండా రైల్వే స్టేషన్ లో ముళ్ల పొదలు, చెత్తాచెదారంఉన్నా సంబంధిత రైల్వే అధికారులు వాటిని తొలగించకపోవడంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు. తలమడుగు రైల్వే స్టేషన్‌లను ఆధునీకరించి దూర ప్రాంతాలకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ రైలు నిలపాలని పలుమార్లు గ్రామస్థులు రైల్వే శాఖ ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఇప్పటివరకు దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లు నిలపడం లేదు. ప్రతీ రోజు మండల కేంద్రం నుంచి మహారాష్ట్ర నాందేడ్, ముంబై, నాగపూర్, ఆదిలాబాద్, షిరిడి, తిరుపతి, హైదరాబాద్, సికింద్రాబాద్ ఇతర దూర ప్రాంతాలకు ఎందరో మంది ప్రయాణికులు వెళుతున్నప్పటికీ వారికి మండల కేంద్రం లో ఎక్స్‌ప్రెస్ రైలు ఆగకపోవడంతో ఆదిలాబాద్ వెళ్లాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. గతంలో మండల కేంద్రానికి నాందేడ్ డివిజన్ ఆర్ఎం వచ్చి గ్రామస్తుల సమస్య లను తెలుసుకుని రైల్వే స్టేషన్‌ను ఆధునీకరించి దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలిపేందుకు కృషి చేస్తానని చెప్పినప్పటికీ కేవలం హామీలకే పరి మితమయ్యాయి. కాని తలమడుగు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను ఎవరూ పట్టించుకోవడం లేదని ప్రయా ణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా రైల్వే శాఖ ఉన్నతాధికారులు స్పందించి తలమడుగు రైల్వే స్టేషన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించి దూర ప్రాంతాలకు వెళ్లే రైళ్లను నిలపాలని ప్రయాణికులు కోరుతున్నారు.



తలమడుగు మండలకేంద్రంలో రైలు బండి నిలిచిన దృశ్యం


తలమడుగు రైల్వే స్టేషన్‌లో ప్రయాణికులకు కుర్చీలు సరిగా లేని దృశ్యం


రైల్వే స్టేషన్‌లో మరమ్మతుకు నోచుకోని చేతి పంపు

టమాట ఫ్రం ఆంధ్ర

- ప్రతికూల పరిస్థితులతో స్థానికంగా తగ్గిన దిగుబడులు
- చిత్తూర్ జిల్లా మదనపల్లి నుంచి సరఫరా
- వారం రోజుల వ్యవధిలో రెట్టింపైన ధరలు
- రూ.50 కు లభ్యమవుతున్న కిలో టమాటలు

భైంసా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి పరిహసంతో కూరగాయాల సాగు పరిస్థితి అస్తవ్యస్థంగా మారింది. ప్రతికూల పరిస్థితులతో దిగుబడులు పూర్తిస్థాయిలో తగ్గిపోతున్నాయి.అనుకూలమైన వాతవరణంలో లేకపోవడంతో కొన్ని రకాల కూరగాయలు మాత్రమే ఇక్కడి ప్రాంతంలో సాగులోనున్నాయి. ప్రస్తుతం జిల్లాలో బెండ, బీరకాయ, వంకాయ దిగుబడులు అరకొరగా వస్తుండగా ఇతర కూరగాయల దిగుబడులు లేవనే చెప్పే పరిస్థితి నెలకొంది. దీంతో జిల్లాలోని ప్రధాన ప్రాంతాల మార్కెట్లకు కూరగాయాలు నిత్యం ఇతర ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి. ఈ క్రమంలో వీటి ధరలు రోజురోజుకు పెరుగుతూ పోతున్నాయి. కూరగాయల ధరఘాతాలతో వినియోగదారులు బెంబెలెత్తిపోతున్నారు. ఆకాశన్నంటుతున్న కూరగాయాలు కొనాలంటే వినియోగదారులు జంకుతున్నారు. ప్రధానంగా అన్నివర్గాల ప్రజానీకానికి అత్యంత ప్రీతీపాత్రమైన టమాట ధర స్థానిక మార్కెట్‌లో వారం రోజుల వ్యవధిలో రెట్టింపు స్థాయికి పెరిగింది. గత నెల వరకు స్థానిక మార్కెట్లో టమాట కిలో ఒక్కింటికి రూ.25తో లభ్యమవ్వగా వారం రోజుల వ్యవధిలో ఈ ధర రెట్టింపైంది. ఒక్కసారిగా వీటి ధర కిలో ఒక్కింటికి రూ.50కు చేరుకుంది. వారం రోజుల క్రితం వరకు నిజామాబాద్, మహారాష్ట్రలోని నాందేడ్ తదితర ప్రాంతాల నుంచి టమాట సరఫరా అవ్వగా ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని చిత్తూర్ జిల్లా మదనపల్లి నుంచి ఇక్కడికి సరఫరా అవుతున్నాయి. ప్రకృతి ప్రకోపానికి ఇక్కడి సమీప ప్రాంతాల్లో టమాటతో పాటు ఇతర కూరగాయాల పంటల దిగుబడులు పూర్తి స్థాయిలో తగ్గిపోయాయి. ఈ కారణంగా ఇక్కడి ప్రాంతానికి అవసరమైన కూరగాయాలు అధిక శాతం ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి సరఫరా అవుతున్నాయి. సూదూర ప్రాంతం నుంచి కూరగాయలు దిగుబడులు దిగుమతి అవుతున్న నేపథ్యంలోనే ధరలు అమాంతంగా పెరుగుతున్నట్లుగా తెలిసింది.


టమాట దిగుబడులను కొనుగోలు చేసి తీసుకువెళుతున్న రిటైల్ వ్యాపారులు


ఇచ్చోడలో బస్సు ఎక్కేందుకు అవస్థలు పడుతున్న ప్రయాణికులు

బురదమయంగా ఇచ్చోడ బస్టాండ్

- బస్టాండ్‌లోకి రాని బస్సులు
- ప్రయాణికుల వెతలు
- పట్టించుకోని అధికారులు

ఇచ్చోడ, జులై, 9 (ఆంధ్రజ్యోతి) : పంకం తొక్కితేనే ప్రయాణం సాగుతుందనడానికి నిదర్శనం ఇచ్చోడ ప్రయాణ ప్రాంగణం. బస్టాండు అవరణంతా బురద కావడంతో బస్సులు లోనికి వెళ్లడంలేదు. దీంతో బస్సులు రోడ్లపైనే నిలపడంతో ప్రయాణీకులు పడరాని పాట్లు పడుతున్నారు. ఈ బస్టాండు నుంచి ఆదిలాబాద్.. నిర్మల్ వైపునకు వెళ్లే ఆర్టీసీ బస్సులు ఇచ్చోడ బస్టాండ్‌లోకి రాకపోవడంతో ప్రయాణీకులు అవస్థలు పడుతున్నారు. రహదారి విస్తరణ సమయంలో ఇచ్చోడ బస్టాండును దశాబ్దాల తరువాత పునఃప్రారంభించి నప్పటికీ బస్టాండు అవరణ మొత్తం బంకమట్టిలా బురదమయంగా మారింది. ఈ నేపథ్యంలో నిర్మల్, ఆదిలాబాద్, బోథ్, సిరికొండ, కిన్వట్, ఉట్నూర్ బస్సులు బస్టాండ్‌కు రాకుండా ప్రధాన రోడ్లపైనే నిలుస్తుండడంతో ప్రయాణికులు సతమతమవుతున్నారు. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి బురద కష్టాలు తొలగించాలని ప్రయాణికులు కోరుతున్నారు.


బురదమయంగా ఉన్న ఇచ్చోడ బస్టాండ్

కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి

● బీజేఎల్పీ నేత ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి

మామడ, జులై 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్రం నిధులతోనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందని నిర్మల్ ఎమ్మెల్యే బీజేఎల్పీ నేత మహేశ్వర్ రెడ్డి అన్నారు. బుధవారం రోజున మండలంలోని నల్దుర్తి గ్రామంలో 20 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మాటల ప్రభుత్వమే గాని ఇప్పటి వరకు ఏ ఒక్క హామీని 100 శాతం నిర్వహించలేదని ఎద్దేవా చేశారు. ఉపాధి హామీ నిధులతో ప్రతీ గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించిన ఘనత బీజేపీ కేంద్ర ప్రభుత్వం అన్నారు. ప్రజలకు ప్రతిపక్షంలో అండగా ఉండి ప్రజల సమస్యలపై పోరాడుతానని తెలిపారు. నల్దుర్తి భీమన్న దేవాలయానికి రోడ్డు మం జూరుకు తనవంతు కృషి చేస్తానన్నారు. దళిత బస్తీకి దారికై త్రీఫేస్ కరెంట్ మంజూరుకై అధికారులతో మాట్లాడుతానన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు రంజిత్ కుమార్, మండల నాయకులు బాపురెడ్డి, కోండ్ర రాజారెడ్డి, చక్రపాణి, జట్టు దినేష్, ఎంపీడీవో సుశీల్ రెడ్డి, ఎంపీవో ఖలీమ్, పంచాయతీ కార్యదర్శి మురళి, మాజీ ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.


నల్దుర్తిలో శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మహేశ్వర్ రెడ్డి


ట్రిపుల్ ఐటీకి ఎంపికైన అల్ఫీయా కౌసర్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

గత ఏడాది అక్క.. ఈ ఏడాది చెల్లెలు

● బాసర ఆర్జీయూకేటీలో సీటు సంపాదించిన అక్కా చెల్లెళ్లు

బాసర, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటిలో బాసర మండల కేంద్రం నుంచి ఒకే ఒక్కరు ఎంపికయ్యారు. బాసర మండల కేంద్రంలో బాలిక పాఠశాలలో చదివిన ఆల్ఫీయా కౌసర్ 10వ తరగతిలో 546 మార్కులు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు సంపాదించారు. దీంతో ఉపాధ్యాయులు తోటి విద్యార్థులు అల్ఫీయాను అభినందించారు. అల్ఫీయా అక్క అది బా కౌసర్ గత ఏడాది 10వ తరగతిలో 9.8 గ్రేడ్ సాధించి ఆర్జీయూకేటిలో ప్రవేశం పొందారు. ఇద్దరు అక్క, చెల్లెళ్లు కష్టపడి చదివి ట్రిపుల్ ఐటీలో సాటు సంపాదించిన వారిద్దరు అందరి నుంచి ప్రశంసలు పొందుతున్నారు.

చింతగూడ వాసుల తీరని చింత!

- అర్ధాంతరంగా ఆగిన డబుల్ బెడ్ రూమ్‌లు
- రహదారి కష్టాలు తీరేది ఎన్నడో...


చింతగూడ గ్రామం ఇదే


అర్ధాంతరంగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్‌లు

బోథ్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారుమూల గిరిజన గ్రామమైన చింతగూడ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉంది. దీంతో ఆ గ్రా మస్థులు బాహ్య ప్రపంచానికి దూరంగానే ఉన్నారు. విసిరి పారేసినట్టు గుట్ట పక్కన వెలిసిన ఈ గ్రామంలో కనీస వసతులు లేవు. దీంతో గ్రామస్థులు మా గ్రామం ఎప్పుడు అబివృద్ధి చెందుతుందో అని చింతిస్తూ ఉంటారు.

● రహదారి పూర్తికాక ఇబ్బందులు ఎన్నో

మండలంలోని మర్ల పెల్లి గ్రామం నుంచి దాదాపు 8 కిలోమీటర్ల దూరంలో గ్రామం ఉంది. గ్రామానికి వెళ్లాలంటే ఎలాంటి వాహన సౌకర్యం లేదు. గ్రామస్థులు అత్యవసర పరిస్థితులపై బయటకు రావాలంటే గ్రామంలో ఉన్న ఒకే ఒక్క ఆటో వీరి ప్రయాణ వాహనం. ఆటో చెడిపోయిన ఆటో డ్రైవర్ లేకపోయినా అటవీ మార్గంగా గుండా మరల పెల్లి వరకు నడిచి రావాల్సిందే. అయితే గ్రామానికి వేసిన మట్టి రోడ్డు ప్రతీ ఏడాది వర్షాకాలం కొట్టుకుపోవడం అనవాయితీగా మారిందని ఆ గ్రామ గిరిజనులు వాపోతున్నారు. వర్షాకాలంలో వర్షం కురిసింది అంటే గ్రామం సమీపంలో ఉన్న వాగు పొంగిపొర్లితే గ్రామానికి రాకపోకలు తెగిపోతాయని వాపోతున్నారు. మా గ్రామానికి వంతెన నిర్మిస్తే సగం ఇబ్బందులు పోతాయని అంటున్నారు.

● ఒకే ఒక్క ఉపాధ్యాయుడు

గ్రామంలో ఐటిడిఏ ఆధ్వర్యంలో ఒకే ఒక్క ఉపాధ్యాయుడితో పాఠశాల కొనసాగుతుంది. పాఠశాలలో ప్రభుత్వం సిఆర్టిని నియమించింది. ఒకటి నుండి నాలుగు తరగతులు బోధించేందుకు ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఉన్నాడు. గ్రామంలో నుంచి చదువుకునేందుకు విద్యార్థులు వివిధ గ్రామాల్లో ఉన్న ఎస్టి హాస్టల్లో చదువుకుంటున్నారు. వచ్చిన పిల్లలకు తరగతి గదిలో పాఠాలు బోధించి ఉపాధ్యాయుడు వెళ్ళిపోతుంటాడని గ్రామస్థులు పేర్కొంటున్నారు. కాగా గ్రామంలో ఉన్న అంగన్‌వాడీ ఉపా ధ్యాయురాలు ఉన్న ఆయా లేకపోవడంతో ఉపాధ్యాయురాలు అన్నితానై పని చేసుకుంటుంది. ఆయాను నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● పడకేసిన డబుల్ బెడ్ రూమ్‌లు

గ్రామంలో గత పది సంవత్సరాల క్రితం చేపట్టిన డబుల్ బెడ్ రూమ్‌లు నత్తనడకలో కొనసాగుతున్నాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్‌కు ప్రభుత్వపరంగా సకాలంలో బిల్లులు మంజూరు కాకపోవడంతో వాటిని అర్ధాంతంగా నిలిపివేశారు. గ్రామానికి దాదాపు 21 డబుల్ బెడ్ రూములు మంజూరు కాగా ఇండ్లు అర్ధాంతంగా ఆగిపోవడంతో కొంత మంది లబ్ధిదారులు ఇబ్బందులకు గురవుతున్నారు. ఇల్లు పీకి పందిరి వేసుకున్నట్లు అవుతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. తమ ఇండ్లు ఎప్పుడు పూర్తి అవుతాయో ఆ దేవునికి తెలుసు అని వాపోతున్నారు. అధికారులు ఇళ్ల నిర్మాణంపై చర్యలు చేపట్టాల్సి ఉంది.



● బేల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ముదురుతున్న.. ప్రొటోకాల్ వివాదం!

» బేల ఆసుపత్రి ప్రారంభోత్సవంతో ప్రతిపక్షాలకు ఝలక్

» ఎంపీ, ఎమ్మెల్యే లేకుండానే ఆసుపత్రిని ప్రారంభించిన అధికారులు

» అధికారిక కార్యక్రమాల్లో ఆ నేతల జోక్యం వద్దంటూ డైరెక్షన్

» మంత్రి జూపల్లి జిల్లా పర్యటనతో మారుతున్న పొలిటికల్ సీన్

ఆదిలాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న జిల్లాలో మాత్రం దానికి భిన్నమైన రాజకీయ పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఖానాపూర్ నియోజకవర్గంలో మినహా ఆదిలాబాద్, బోథ్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు కొనసాగుతున్నారు. దీంతో అధికార కాంగ్రెస్ పార్టీకి కొంత ఇబ్బందికరంగానే మారుతుందని చెప్పవచ్చు. ముఖ్యంగా నిధుల కేటాయింపు, సంక్షేమ పథకాల అమలు, అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు ఇతర అధికారిక కార్యక్రమాల్లో ఇతర పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధుల జోక్యాన్ని కాంగ్రెస్ సహించలేక పోతుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇటీవల జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మంత్రి జూపల్లి కృష్ణారావు తొలిసారిగా జిల్లాలో పర్యటించారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవాలను చేపట్టారు. ఇందులో భాగంగానే బేల మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనాన్ని ప్రారంభించేందుకు అధికారులు ఏర్పాట్లను పూర్తి చేశారు. అయితే ఉన్నట్టుండి ఆ కార్యక్రమం రద్దు కావడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ నేతలకు బేల ఆస్పత్రిని ప్రారంభించేందుకు సమయం దొరకలేదా? అంటూ మాజీ మంత్రి జోగు రామన్న విమర్శలకు దిగడం చర్చనీయాంశంగా మారింది. ఆ తర్వాతనైన ఎంపీ గోడం నగేష్‌తో కలిసి స్థానిక ఎమ్మెల్యే పాయల శంకర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తారని అందరూ భావించారు. కానీ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో హుటాహుటిన ప్రొటోకాల్‌ను పాటించకుండా వైద్య ఆరోగ్య శాఖ అధికారులే ఆసుపత్రిని ప్రారంభించడం జిల్లా రాజకీయ వర్గాల్లో ప్రస్తుతం హాట్ టాపిక్‌గా మారింది.



పక్కన పెట్టారా? లేక పెట్టించారా?

బేల ఆసుపత్రి ప్రారంభోత్సవంలో ఎంపీ, ఎమ్మెల్యేలను అధికారులే పక్కన పెట్టారా? లేక ఎవరైనా పక్కన పెట్టించారా? అనే అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఆసుపత్రి ప్రారంభోత్సవం తర్వాత అధికారుల తీరుపై ఎంపీ, ఎమ్మెల్యేలు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. ప్రస్తుతం పైకి బాగానే కనిపిస్తున్నా.. లోలో మాత్రం రగిలి పోతున్నట్లు కనిపిస్తుంది. బేల ఆసుపత్రి విషయంలో ప్రతిపక్షాలకు దిమ్మ తిరిగే ఝలక్ ఇచ్చామని కాంగ్రెస్ నేతలు బహిరంగంగానే చెబుతున్నారు. అయితే ఎమర్జెన్సీ సేవల విషయంలో రాద్ధాంతం చేయడం ఇష్టం లేకనే ఆ విషయాన్ని తేలికగా తీసుకొని వదిలేయాల్సి వచ్చిందని బీజేపీ పేర్కొంటుంది. మొత్తానికి ఎంపీ, ఎమ్మెల్యేలు లేకుండానే ఆసుపత్రిని ప్రారంభించడంపై జిల్లాలో వివిధ రకాల ప్రచారం సాగుతుంది. ముఖ్యంగా సోషల్ మీడియా వేదికగా ఎవరికి వారే అనుకూలంగా ప్రచారం చేసుకోవడం కనిపిస్తుంది. ఆసుపత్రిని ప్రారంభించిన వెంటనే మాజీ మంత్రి జోగు రామన్న, ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస్ రెడ్డిలు ఆసుపత్రిని సందర్శించారు. ఆ తర్వాత బుధవారం ఎమ్మెల్యే పాయల శంకర్ సందర్శించి ఆసుపత్రిలో పూజలు చేయడం చర్చకు దారి తీస్తుంది. అంతేకాకుండా మొత్తానికి అదిలాబాద్ నియోజకవర్గ రాజకీయాలకు బేల ఆసుపత్రి ప్రారంభోత్సవం సెంటర్ పాయింట్‌గా మారిందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

పక్కా ప్లాన్‌తో ముందుకు..

త్వరలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరిగే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ పార్టీ పక్కా ప్లాన్‌తో ముందుకెళ్తున్నట్లు తెలుస్తోంది. అధికారిక కార్యక్రమాల్లో ప్రతిపక్ష పార్టీలకు ప్రాధాన్యతను ఇచ్చే విషయంలో ఆచితూచిగా అడుగులు వేస్తుంది. ఇకపై ఆ నేతలకు పెద్దగా

(తరువాయి 6వ పేజీలో...)

జిల్లా కలెక్టర్ ఆదేశాలతోనే ప్రారంభించాం

: రాథోడ్ నరేందర్, డీఎంహెచ్‌వో, ఆదిలాబాద్



బేల మండలంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాలతోనే ప్రారంభించడం జరిగింది. వానాకాలం సీజనల్ వ్యాధుల దృష్ట్యా ఎమర్జెన్సీ సేవలను అందించేందుకు ఆస్పత్రిని అందుబాటులోకి తీసుకొచ్చాం. ఈ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యేలకు కూడా సమాచారం ఇవ్వడం జరిగింది.

అధికారులు అలా ఎందుకు చేశారో అర్థం కావడం లేదు

: పాయల శంకర్, ఆదిలాబాద్ ఎమ్మెల్యే



జిల్లా ఇన్‌చార్జి మంత్రి పర్యటలో భాగంగా ఆసుపత్రిని ప్రారంభించేందుకు షెడ్యూల్ ఖరారు చేశాం. వాతావరణం సహకరించకపోవడంతో మంత్రి బేల పర్యటన వాయిదా పడింది. తర్వాత వీలును బట్టి ఆసుపత్రిని ప్రారంభించాలనుకున్నాం. కానీ ఎమర్జెన్సీ పేరిట అధికారులే ప్రారంభించారు. అలా ఎందుకు చేశారో? తెలియడం లేదు. దీనిపై సమయం వచ్చినప్పుడు స్పందిస్తా.



వంజరి సంఘం ఆధ్వర్యంలో వనదేవతకు పూజలు చేస్తున్న దృశ్యం

వన దేవతకు ప్రత్యేక పూజలు

● గ్రామ పొలిమేరలో నైవేద్యాల సమర్పణ

● వన్యమృగాల నుంచి పశువులను రక్షించాలని మొక్కులు

ఉట్నూర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసంలో గ్రామదేవతలకు పూజలు చేస్తున్నట్టుగానే వన దేవతలకు సైతం గిరిజనులు, గిరిజనేతరులు కూడా పూజలు నిర్వహిస్తున్నారు. వ్యవసాయ ఆధారిత జీవనాలు సాగిస్తున్న వంజరి కులస్థులు బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని పోచమ్మ ఆలయంలో పూజలు చేసిన అనంతరం గ్రామ పులిమెరలో ఉన్న అటవీ ప్రాంతానికి చేరుకుని వనదేవతలకు నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు. వానకాలం పంటలు సమృద్ధిగా పండాలని, తమ పాడి పశువులు మీద కోసం అడవుల వైపు వెళితే వన్యమృగాల నుంచి వణదేవత కాపాడాలని కోరుతూ వన దేవతకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో కొండేరి రాజేశ్వర్, కరిపే గంగన్న, సాడగే చిన్న రాజన్న, జగిత్యాల గంగన్న, బలిష్టి రాము, సాడిగే రాజగోపాల్, కాలేరి రవి, నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో కళాకారులతో అవగాహన

ఉట్నూర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లా పౌర సంబంధాల శాఖ అధికారి తిరుమల ఆదేశాల మేరకు ఉట్నూర్ మండలంలోని కామాయిపేట్ గ్రామంలో ఇందిరా మహిళ శక్తి సంబరాల్లో భాగంగా మహిళలకు పాటలు, నాటిక ద్వారా కళాకారులు అవగాహన కల్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా మహిళా సంఘాలకు ప్రభుత్వ పథకాల పై తెలంగాణ సాంస్కృతిక సారధి ఆదిలాబాద్ బృందం టీం 2 ఆధ్వర్యంలో కళా ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వడ్డీలేని రుణాలు, మహిళ సాధికారత, ఉచిత బస్సు ప్రయాణం, ఆరు గ్యారంటీల పై అవగాహన కల్పించడం జరిగిందని ఐకేపీ ఏపీఎం వివరించారు. ఈ కార్యక్రమానికి గ్రామపటేల్, మహిళలు, గ్రామస్థులు హాజరయ్యారు. కళాకారులు టీం సభ్యులు గోవింద్ రావు, ఆశీష్, గోడం, నగేష్, నరసమ్మ, ద్రుపదలు పాల్గొన్నారు.



కామాయిపేటలో కళాజాతా కార్యక్రమం నిర్వహిస్తున్న కళాకారులు



మొక్కలు నాటుతున్న ఎంఈవో భూమారెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి

నేరడిగొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంఈఓ భూమా రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బుగ్గారాం(బి) గ్రామంలో గల ప్రాథమికోన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ఈసందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలని సూచించారు, అనంతరం విద్యార్థుల ప్రగతిని తరగతుల వారీగా పరిశీలించి ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాల ఆవరణలో మొక్కలను నాటారు. అయన వెంట ప్రధానోపాధ్యాయురాలు రాథోడ్ సునిత, ఉపాధ్యాయులు వెంకటరమణ, లీలావతి తదితరులు ఉన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

ఆదిలాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకులకు వివిధ నైపుణ్యాలపై హైదరాబాద్‌లో అందించే ఉచిత శిక్షణకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని బీసీ సంక్షేమ శాఖ అధికారి కె.రాజలింగం ఒక ప్రకటనలో తెలిపారు. సాఫ్ట్ స్కిల్స్ ట్రైనింగ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్, రెజ్యూమ్, బిల్డింగ్, కమ్యూనికేషన్ ఫౌండేషన్, మాక్ ఇంటర్వ్యూ, సెల్ఫ్ కాన్ఫిడెన్స్ బిల్డింగ్, మెంటల్ ఎబిలిటి ట్రైనింగ్‌పై శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. అలాగే శిక్షణ సమయంలో అభ్యర్థులకు రవాణా, భోజన వసతిని కల్పించడం జరుగుతుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సంబంధిత పత్రాలను జిల్లా బీసీ సంక్షేమ అభివృద్ధి అధికారి కార్యాలయంలో జూలై 14వరకు అందించాలని, డిగ్రీ ఉత్తీర్ణులై 21 నుంచి 30 ఏళ్ల లోపు ఉండాలన్నారు.

నేరడిగొండ ఎంపీడీవోగా శేఖర్

నేరడిగొండ, జూలై 9(ఆంధ్రజ్యోతి): నేరడిగొండ ఎంపీడీవోగా ఎస్ శేఖర్ బుదవారం బాధ్యతలను తీసుకున్నారు. గతంలో పని చేసిన ఎంపీడీవో రాజ్‌వీర్ బదిలీపై నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో తలమడుగు మండలం నుంచి నేరడిగొండకు బదిలీపై వచ్చి బాధ్యతలను చేపట్టగా కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికారు. మండలంలో నెలకొన్న సమస్యల పరిష్కారాని కృషి చేస్తానని అందుకు మండల ప్రజాప్రతినిధులు అధికారులు సహకారం అవసరమని ఆయన పేర్కొన్నారు,



ఎంపీడీవోగా బాధ్యతలను స్వీకరిస్తున్న శేఖర్

చింతగూడ వాసుల తీరని చింత!

● అర్ధాంతరంగా ఆగిన డబుల్ బెడ్ రూంల నిర్మాణ పనులు

● రహదారి కష్టాలు తీరేది ఎన్నడు?

● అభివృద్ధికి ఆమడ దూరంలో గ్రామం



7

రైల్వే స్టేషన్‌లో సమస్యల తిష్ఠ

● తలమడుగులో కనీస సౌకర్యాల కరువు

● హామీలకే పరిమితమైన నూతన రైల్వే స్టేషన్ నిర్మాణం

● ఆగని ఎక్స్‌ప్రెస్ రైళ్లు



విధానాలు మార్చుకోకపోతే..

కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ● జిల్లావ్యాప్తంగా ఆయా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన సార్వత్రిక సమ్మె సక్సెస్

ఆదిలాబాద్, జూలై 9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న విధానాలను మార్చుకోక పోతే ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జిల్లావ్యాప్తంగా కార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె చేపట్టారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా జిల్లా కేంద్రంతో పాటు ఆయా మండలాల్లో నిరసన ర్యాలీలు నిర్వహించారు. పట్టణంలో కలెక్టరేట్ వద్ద కార్మిక సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి కిరణ్ మాట్లాడుతూ భారతదేశ కార్మిక వర్గం అనేక పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను కార్పొరేట్లకు అనుకూలంగా సవరణలు చేస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు రావడంతో కార్మికులను ప్రమాదంలోకి నెట్టిందన్నారు. మరోవైపు ప్రభుత్వ రంగ సంస్థలను ప్రారంభించకపోగా.. ఉన్న సంస్థలన్నింటిలో వాటాలను విక్రయిస్తూ ప్రైవేటీకరణ పేరిట మోసం చేస్తుందన్నారు. నేషనల్ మానిటైజేషన్ పైపులైన్ పేరుతో ప్రైవేటీకరణను మరింత వేగవంతం చేసిందన్నారు. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేస్తున్న కార్మిక ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేదన్నారు. 12గంటల పని దినాలను చట్టబద్ధత చేసి కార్మికుల శ్రమను కార్పొరేట్లు దోచుకునే విధంగా చట్టాల్లో మార్పు తీసుకు రావడం జరిగిందన్నారు. రైతాంగం మద్దతు ధరల చట్టం కోసం పోరాటాలు నిర్వహిస్తున్న ఎంఎస్‌పీ చట్టాన్ని చేయడం లేదని విమర్శించారు. గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని ఎన్‌హెచ్‌ఎం, ఐసీడీఎస్, ఎండీఎంఎస్ లాంటి స్కీమ్‌లకు నిధులు కేటాయించకుండా నిర్వీర్యం చేస్తుందన్నారు. హక్కుల సాధనకు సమస్యల పరిష్కారానికి కార్మికులంతా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిలో మార్పురాకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామన్నారు. ఇందులో వ్యవసాయ కార్మిక సంగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు లంక రాఘవులు, ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశ లత, టీయూసీఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు జె.దశిత్, బి.జగత్‌సింగ్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి వెంకట్ నారాయణ, షేక్ ఫహీం, అగ్గిమల్ల స్వామి, నవీన్‌కుమార్, సుజాత, భీంరావ్, ఆశన్న, దర్శనాలనగేష్, మంజుల, తదితరులు పాల్గొన్నారు.

● ఉట్నూర్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా

ఉట్నూర్: కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలని, రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. సార్వత్రిక సమ్మెలో భాగంగా ఉట్నూర్ మండల కేంద్రంలో బుధవారం ర్యాలీ, ధర్నా నిర్వహించారు. దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా ఐటీడీఏ కార్యాలయం ముందు నిరసన, సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కమిటీ సభ్యులు దర్శనాల మల్లేష్, అంగన్‌వాడీ రాష్ట్ర అధ్యక్షులు కె.సునితలు మాట్లాడుతూ కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ అపాలని, రైతు పండించిన పంటకు గిట్టుబాటు ధర చట్టం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర కార్మిక సంఘాలు సీఐటీయూ పిలుపు మేరకు దేశ వ్యాప్త సమ్మె సందర్భంగా ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయం నుంచి ఎన్టీఆర్‌చౌక్ వరకు ర్యాలీ నిర్వహించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనం కోసం పని చేస్తున్నది తప్ప కార్మికులను పట్టించుకోవడం లేదని విమర్శించారు. గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలను రద్దు చేసి వాటికి బదులుగా కార్మికులకు నష్టం చేసే నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చారని విమర్శించారు. కనీస వేతనం, సంఘం పెట్టుకునే హక్కు సమ్మె హక్కు లేబర్ కోడ్‌ల ద్వారా కాలరాయబడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. 8గంటల పనిని 12గంటలకు పెంచి కార్మికులను శ్రమదోపిడికి గురి చేశారని విమర్శించారు. కులం, మతం, అస్తిత్వ భావజాలంతో కార్మికోద్యమం దెబ్బ తీయడానికి, రాజకీయ ప్రయోజనాలను కాపాడుకోవడానికి బీజేపీ ప్రయత్నిస్తుందని ఆరోపించారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చిన నుంచి కార్పొరేట్‌లకు రూ.16లక్షల 35వేల కోట్లు మాఫీ చేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ, ఆశా గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యల పరిష్కరించాలని మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రత్యేక గ్రౌండ్ ద్వారా వేతనాలు ఇవ్వాలని, కనీస వేతనం ప్రతీ కార్మికులకు రూ.27 వేలు ఇవ్వాలని, మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించి.. వారికి కనీస వేతనం అమలు చేయాలని, సంఘటిత రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. భవన నిర్మాణ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న వెల్ఫేర్ కార్డులను వెంటనే విడుదల చేయాలని పెండింగ్‌లో ఉన్న క్లైమ్లను పరిష్కరించాలని, ప్రతీ కార్మికునికి ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మికులు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నైతం శోభ అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కోశాధికారి పి.రత్నమాల, జిల్లా నాయకులు ముక్తా, పద్మ, సర్ణలత, లక్ష్మి, సంగీత, మాలన్, యమునా ఆశా యూనియన్ జిల్లా గంగమ్మ, పంచపూల, యమునా, నాగుబాయి, వందన, గ్రామ పంచాయతీ యూనియన్ జిల్లా కోశాధికారి మేకల ఆనంద్‌రావు, జిల్లా నాయకులు సోనేరావు, వెంకట్రావు, సుందర్, గంగమ్మ, రాధ, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో డీటీ రమేష్‌కు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు



బజార్‌హత్నూర్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు



ఆదిలాబాద్‌లో సమ్మె కరపత్రాలను విడుదల చేస్తున్న నేతలు



ఉట్నూర్‌లో ధర్నా నిర్వహిస్తున్న సీఐటీయూ కార్యకర్తలు

● లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలి

ఇచ్చోడ: కార్పొరేట్ సంస్థలకు మేలుచేసే నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించుకోవాలని ఐక్య కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రమేష్ జాదవ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు మాట్లాడుతూ.. లేబర్‌కోడ్‌లు కార్మికులకు గుదిబండగా మారే ప్రమాదం ఉందన్నారు. దేశవ్యాప్తంగా బుధవారం సార్వత్రిక సమ్మెకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని ఏఐటీయూసీ, టీఏజీఎస్‌లు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ మండల కార్యదర్శి కళ్లెపల్లి గంగయ్య, టీఏజీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పూసం సచిన్, రవి, అశోక్, పోశెట్టి, లక్ష్మి, అనసూయ, తదితరులు పాల్గొన్నారు.

● సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలి : ఏఐటీయూసీ

బజార్‌హత్నూర్: కార్మికుల డిమాండ్ మేరకు నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇప్పించాలని డిమాండ్ చేస్తూ మండల కేంద్రంలో బుధవారం తహసీల్దార్ శ్యామ్‌సుందర్‌కు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఆయా రంగాల కార్మికులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు కీర్తి రమణ, మండల కార్యదర్శి రవీందర్‌లు మాట్లాడుతూ అంగన్‌వాడీ వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అంతేకాకుండా వారికి రూ. 26 వేల వేతనం అందించాలని వారు ఈ సందర్భంగా పేర్కొన్నారు. అలాగే భవన నిర్మాణ కార్మికులు, మేస్త్రీలకు 55 ఏళ్ల పైబడిన వారికి 5వేల పెన్షన్ అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులు, మధ్యాహ్న భోజన కార్మికులు, అంగన్‌వాడీ కార్మికులు, సివిల్ సప్లయి హమాలీ కార్మికులు, తదితరులు పాల్గొన్నారు.